# మాతృ హృదయము

శ్రీమతి పి. శేషమాంబగారు

వకీలు కేశవదాసుగారి భార్య శ్యామలాదేవి. రాత్రి 12 గంటలవేళ నిద్ర మేల్కొని తన గదిలో కుక్క పిల్లలని ముద్దులాడుతున్నది. కేశవదాసుగారికి నిద్ర మెలకువవచ్చి చూస్తే పక్కమంచము ఖాళీగా నున్నది. యింత రాత్రివేళ ఎక్కడి కెళుతుందాయని ఆలోచిస్తున్న సమయములో ప్రక్కగదిలో యేవో అస్పష్టముగా మాటలు వినబడినవి. ఈవిడగారే అయివుంటుందని లేచివెళ్లి గదిలోనికి ఒక అడుగువేసి వంగిచూస్తే తన భార్యే కుక్కపిల్లలని వడిలో పెట్టుకొని బుజ్జగిస్తున్నది. ఆ తమాషాచూచి పెద్దగా నవ్వాడాయన. తెల్లబోయి చూచింది శ్యామలాదేవి. నవ్వుతూనే "ఏం శ్యామలా! నిద్రపట్టలేదా, యీ అర్ధరాత్రి వేళ కుక్కపిల్లలని ముద్దులాడుతున్నావు. భలేసమయము దొరికిందిలే. సిగ్గులేదూ నీకు, యింత పెద్దదానవై కుక్కపిల్లలతోనా ఆడుకొనేది" అని మెత్తమెత్తగా నాలుగు చీవాట్లుపెట్టి ద్వారములో నిలబడి భార్యావైపు అదేదృష్టిగా చూడమొదలుపెట్టాడు. శ్యామలాదేవి పెనిమిటి మందలింపులకు కొంచెము చిన్నపుచ్చుకొని, ఆయనవైపుకి జాలిగాచూచి, "వీటికి తల్లిలేదండి, పాపము చలికి కుంయ్, కుంయ్‌మని పూరికే అరుస్తుంటేను మీకు నిద్రాభంగ మాతుందేమోనని సముదాయిస్తున్నా"నన్నది.

ఈ మాటలు చెపుతుంటే ఆమెకు కళ్లనీళ్లు గిర్రున తిరిగినవి. ఆ సందర్భము భర్తగారు కనిబెట్టకుండా ముఖం ప్రక్కకు త్రిప్పుకొని వూరుకున్నది. "మనదేవుడి మహిమ మనమెరుగనిదా యన్నట్లు తల్లిలేని పిల్లలంతా నీకే దొరుకుతారులే" అని ఒకసారి జాలిగలుగచూచి నీయిష్టమని వెళ్లిపోయాడు వకీలుగారు తనగదిలోకి.

కేశవదాసుగారి తల్లి పూర్వకాలపు మనిషి. పైగా గంగా భాగీరథీ సమానురాలు. తన యేకపుత్రునకు సంతానము లేదనే కొరత యెంతగావున్నా కోడలియొక్క యీ వింతచేష్టలామెకు యెంతమాత్రము సరిపడలేదు. ఆ రోజు ఉదయమున శ్యామల దాసీదానిపిల్లవాడికి పాలుపోయడము కళ్ళారా చూచిందా ముసలావిడ. చూచీచూడగానే ఆమెకు పట్టరాని కోపమొచ్చినది. రంకెలువెయ్య మొదలుపెట్టినది. "పిల్లా! నీవీరోజునుంచీ పూజామందిరములోకీ, వంటగదిలోకీ అడుగుపెట్టావంటే పూరుకొనేది లేదు" అని గట్టిగా శాసించినది. "ఊరుకొంటున్నకొద్దీ మీరిపోతున్నావు. కుక్కపిల్లలని ఒళ్లో పెట్టుకొని కూర్చుంటే చూచీచూడనట్లు పోతుంటిని. ఇదే అలుసని యీ రోజున చండాలపు కుంకనెవడినో తెచ్చి పాలుపోసి పెంచుతావా? పెద్దదాన్ని నేనున్నానని కాస్త వెరవవద్దా? బ్రాహ్మణింట్లో పుట్టి మాలాళ్ల పిల్లాణ్ని పెంచడానికి

నీకు బుద్ధెట్లా పుట్టిందా అనుకుంటూ! బ్రాహ్మణ కొంపలోపుట్టి, మడీమైలావద్దా నీకు. ఏమో, పిల్లా నేపోయిన తరువాత నీయిష్టము. నేనున్నన్నాళ్లు ఈ ఇంటిపద్ధతి నా ఇష్టమే గానీ నీఇష్టమేమీసాగదు" యని చురచురా చూస్తూ లోపలికివెళ్లిపోయింది.

అప్పుడే పూజాగృహములోనికిపోయి, పూజచెయ్యడానికి కూర్చొని పూలకోస మెదురుచూస్తున్నాడు వకీలుగారు. భార్య పూలుకోసుకొని రాకపోగా తల్లి యీ తీరుగా కేకలు వెయ్యడమువిని, "అమ్మా యేమిటి విషయము" అని తల్లినడిగాడాయన. అందుకామె వలవలలాడుతూ, "ఏ పెళ్ళాముతీరు చూడునాయనా - దాసీదాని పిల్లాడిని కొంపలోకి తీసుకొచ్చి పాలుపోసి పెంచుతుందిట. ఏమంటేపిల్లా నీకిదేమిబుద్ధే అంటే పసిబిడ్డ దేవుడితో సమానము; తల్లిలేనిబిడ్డని పెంచితే తప్పాయని జవాబు చెప్పింది. దాన్నేఅడుగు నామాట అబద్ధమేమో. ఎన్నడైనా ఇల్లాంటి వెఱ్ఱిపనులు మనయింట మొగుడుదుమా? మాలాళ్ల పిల్లలకు నీళ్లుపోసి, పాలుపోసి పెంచడము, నాకేమీ బాగాలేదునాయనా. యీ కొంపలో నేనుండలేను. నన్నేకాశీకైనాపంపు ఆ తరువాత మీచిత్తమొచ్చినట్లుండురుగాని" అని ఒక్కచదువు గుక్కతిప్పుకోకుండా చదివేసింది ముసలమ్మ.

శ్యామలాదేవి గుణవతి, విద్యావతి, సౌందర్యవతీ పతిభక్తిగలది. కాని తనకే కొరతా లేకపోయినా 30 సంవత్సరాలు నిండినస్త్రీకి బిడ్డలులేనికొరత ముఖ్యముగా కనబడుతుంది. అలాగే మనశ్యామలాదేవికిగూడా అమ్మాయని పిలచేబిడ్డ లేకపోయె ననేకొరత సహజముగాకలిగినది.

తల్లియొక్క ఆవేశమంతా అణిగిన తరువాత భార్యనిపిలచి "శ్యామలా! ఏమిటీ గొడవంతా"యని ప్రశ్నించాడు.

శ్యా:-ఔనండి నిజమే ఆ పిల్లవాడికి. తల్లిలేదు. కాబట్టి కొంచము బాధ్యత వహించవలసి వచ్చినది. అందుకే యీ గొడవంతాను.

కే:-తల్లిలేని పిల్లలంతా నీకే లభిస్తారేమి ఖర్మము. అది సరేకాని నీచజాతిబిడ్డను మనయింట్లోకిల్లా తీసుకొద్దామనుకున్నావు? కొంచము పూర్వాపరము లాలోచించ వద్దా ?

శ్యా:-హీనజాతిలో పుట్టడమే వాడుచేసుకొన్న పాపమా. ఏమి యిదంతా నాకేమీ అగమ్యగోచరముగానున్నది.

కే:-మరి ఇదే ఆలోచించవలసినది. హిందూసంఘముయొక్క నియమాలు యెంత కఠోరమైనవో నీకు తెలియవా? మతనియమాల ననుసరించి నడచుకొనవద్దా మరి?

శ్యా:-ఆహా, యేమి ధర్మశాస్త్రమండీ. ఆత్మపవిత్రమైనది. అది అందరిలోనూ ప్రకాశిస్తున్నది. కాని అంటరానివారిలో ఆత్మనశించినదా? దేహికే భేదములన్నీ.

కే:-ఐతే పెద్దలనాటి సంఘాచారాలు చెడ్డవనేనా నీయూహా?

శ్యా:-చెడ్డవని మెల్లిగా అంటారా? మనుష్యులు మనిషిని ద్వేషించే ఆచారము చెడ్డది గాక మంచిదా? నిజంగా చెప్పండి పాపపుణ్యాలెరుగని పసికూన; చస్తూ నా చేతిలో పెట్టినదే, దానిమాట నెల్లా కాదనేది? మీకు, మీఅమ్మగారికి ప్రియమైనపని యేదైనా చెయ్యమంటే నేను చచ్చైనా పోతానుగానీ ఆ బిడ్డను విడవలేనండి,. (శ్యామలాదేవి కంట తడిబెట్టినది.)

ఇదివిని తల్లీకొడుకు స్తబ్ధులై యూరకున్నారు. ఇంకేమీ మాట్లాడలేక వకీలు గారు ఆఫీసులోకి, ఆయనగారితల్లి వంటయింట్లోకి వేంచేశారు.

రోజూ భోజనసమయమునకు శ్యామలాదేవి భర్తకు హితవైన పదార్థము లేవైనా స్వయముగా తయారుచేసి, వంటవాడు వండినపదార్థములు కూడా తెచ్చి తాను ప్రక్కను కూర్చోని సపర్యలుచేస్తూ ఆదరణగా ఆమాటా ఈమాటా చెపుతూ వడ్డనచేసే అలవాటు. కాని ఈ రోజున ఒక క్రొత్తయువతి వడ్డించ నారంభించినది. ఆమెకు 20 సంవత్సరాలు వుంటవి. పేరు సుసీల. కాని పేరుకున్న గాంభీర్యము ఆమెలో లేనట్లున్నది. వ్యవహారము, అనవసరముగా మాట్లాడుట, వెకిలితనముగా నవ్వుట, మొదలు పెట్టినదా అమ్మాయి. ఆయనకు కొంత చిరాకుగానే వున్నది. కానీ అన్నిటికీ మౌన ముద్రవహించి గంభీరముగా కూర్చున్నాడు. ఇదేసమయములో తల్లిగారు లోపలనుండివచ్చి "అబ్బాయీ! సుసీల మంచి వంశములోనిపిల్ల. నాకూ కావలసినది. ఆగొడ్రాలివల్ల నీకేమి సుఖము. యీ పిల్లను పెళ్లిచేసుకో. నీకడుపున నాలుగు కాయలు కాస్తే చూచిపోదా మని వున్నా. పెద్దముండనయాను నాయినా! ఈ ఒక్కమాటవిను," అని ప్రారంభించింది. ఇది తల్లిగారి ప్లానుగదాయని తెలుసుకొన్నాడు. "శ్యామలుండగా యీమెకూడా యెందుకమ్మా"యని ఒక్కమాటతో జవాబిచ్చి భోజనము పూర్తిచేసి లేచాడు.

వకీలుగారు కోర్టునుంచి వచ్చేవేళకు పలహారపు పళ్లెము బల్లమీదపెట్టి, కాళ్లు కడుక్కొనేనీళ్లు చేతపట్టుకొని తుడుచుకొనే తువాలు మడత బుజానవేసుకొని తయారుగా నిలచునుండే శ్యామలాదేవి నేడు కనపడలేదు. కాని ఈ క్రొత్తపిల్లే అన్నీ అక్కడపెట్టి ప్రక్కగదిలోకి చక్కాపోయింది. యీ క్రొత్తమార్పు ఆయనకేమీ తృప్తిగాలేదు కాబట్టి ముందు శ్యామలని వెతక నారంభించాడు చివరి

గదిలో ఆ పనిదానిపిల్లవాడి నాడిస్తున్నది ఆమె. మాసినచీర, తైలసంస్కారము లేక రేగివున్నతల ఆవాలకముచూచి ఆయన యేవగించుకొన్నాడు. భర్తనుచూచి భయపడుతూ పిల్లవాడి నక్కడ పడుకోబెట్టి లేచి నిలచున్నదామె. 'శ్యామలా నీకిదే లోకమల్లె వున్నదే అన్నా'డాయన. 'స్త్రీకి తనబిడ్డకంటే మరొక లోకమేముంటుందీ? నన్ను క్షమించండి మీకుపరిచర్యలు చెయ్యనందుకు. సుసీలను వివాహము చేసుకొని సుఖించడమే నాకూ సమ్మతము'' అని వూరుకున్నది శ్యామలాదేవి. ''శ్యామలా నేను ఏకపత్నీవ్రతుడనేకాని ద్విపత్నీవ్రతుడనుకాను. ఇల్లాంటిమాటలు నాకెప్పుడు చెప్పవద్దు. కాగా నీలో యేమయోగ్యతచూచి నేను పునర్వివాహము చేసుకొనేది?''

''ముఖ్యముగా మీతల్లిగారి అభీష్టసిద్ధికొరకు. అది నావుద్దేశ్యములోలేదు; జాతకములో లేనివి ప్రయత్నమువలన ఫలించవని. నాకుతెలుసు. కాబట్టి సుసీలకు తగిన వరుడినితెచ్చి పెండ్లైనా చేస్తానుగాని, యిటువంటి అనుచితమైన పనులు నేనెంత మాత్రమూ చేయజాలను. సుసీల నాకు సోదరీ సమానురాలు.'' భార్యాభర్తలయొక్క సంభాషణంతా ప్రక్కగదిలోనుండి శ్రద్ధగావిన్నది సుసీల. ఇదంతా ముసలామెప్రేరేపణే గాని, దాసుగారి అభిప్రాయము కాదుగదాయని తెలుసుకొన్నది. తనకిక్కడ స్థానము లేదుగదాయని ఒక్క నిట్టూర్పువిడచి చెప్పకుండా యెక్కడికో వెళ్లిపోయింది. ఇంతా మక్కువపడినా దక్కలేదు బిడ్డ.

ఒకనాటి సాయంకాలము పూలచెట్లకు నీళ్లుపోస్తున్నది శ్యామలాదేవి. వీధిలో పిల్ల లెవరో పాడుతున్నట్లు వినిపించినది. ఏమిటా కోలాహలమని ఒక్క అంగలో వాకిట్లో కొచ్చింది. చాలామంది పిల్లలు పది పన్నెండు సంవత్సరాల వయస్సుపిల్లలు, ఖద్దరుదుస్తులు, గాంధీటోపీలు ధరించి, చేతిలో జాతీయ పతాకములు బట్టుకొని వూరేగుతున్నారు. అందరూకలసి జాతీయగీతము పాడుతున్నారు. పాట ఆపి జట్టులోనుంచి యిద్దరు పిల్లలీమె వద్దకువచ్చి, "అమ్మా, దేశసేవ కొకపైసా యివ్వమ్మా" అన్నాడు. మరొకడు "బీదల సహాయానికి పాటుపడుతున్నాము, బెంగాలులో కరువచ్చి ఆకలితో యెక్కడివాళ్లక్కడే చచ్చిపోతున్నారు. మనమందరమూ బీదవాళ్లకు సహాయము చెయ్యాలి తల్లీ!'' యని సంచిజాపాడు. "అమ్మా" యనే మధురధ్వని యీమె చెవులకెంత యింపుగానున్నది. అల్లామళ్లా పిలవమని ఆ పిల్లలనడిగి పిలిపించుకొన్నది. వారి మాటలకు మురిసిపోయి యెత్తుకుముద్దాడినది. ఇల్లాంటిపిల్లలనుకని దేశసేవ కర్పించిన ఆతల్లి యెంత ధన్యురాలో యని తలపోసినది. తన కటువంటిభాగ్యము కలుగనందుకు మనసులోనే చింతించినది. తన వేలినున్న బంగారు వుంగరముతీసి ఆ పిల్లవాడిసంచిలోవేసి సంతసించుచుతు ఆ బాల సమూహము కనుపించునంతవరకూ చూస్తూ అల్లాగే నిల్చున్నదామె.